క్లుప్తంగా

నృసింహుడి సేవలో జడ్జి



పూజలు నిర్వహిస్తున్న జడ్జి దంపతులు

రాయదుర్గం: పట్టణ సమీపాన మల్లాపురం వద్ద కొండల మధ్య కొలువుదీరిన విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి సేవలో వైఎస్సార్ జిల్లా కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లావణ్య తరించారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి జడ్జి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆడియన్ స్వామి దాసన్ ఏపీ రామమూర్తి స్వామిజీ, ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యంశర్మ మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీస్సులు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా పూలహారాలు, శాలువాలతో జడ్జిని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బీఎస్‌టీ తిప్పేస్వామి, ధర్మన్న, గురురాఘవేంద్రప్రసాద్, గురునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం



ఎంపీని సత్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: నియోజకవర్గంలో హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి, రోడ్లు వేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరిన వెంటనే నిధులు మంజురు చేసిన ఎంపీ తలారి రంగయ్యను ఆదివారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య(విడపనకల్లు), ఉపసర్పంచ్ వన్నప్ప, ఉరవకొండ వైస్ ఎంపీపీ నరసింహులు, విడపనకల్లు మండల కన్వీనర్ బసన్న మాట్లాడుతూ నియోజకవర్గంలో హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంజూరు చేయించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగప్ప, ఉలిగప్ప, డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ కేజీబీవీలో కలుషిత ఆహారం తిని పది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజి, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కేజీబీవీ పాఠశాలను విద్యార్థి సంఘాలు సందర్శించారు. భోజన నాణ్యత, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పోషకాహారం అందిస్తున్నా కొందరి నిర్లక్ష్యం వల్ల ఇలాంటి తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి




జయపురంలో పీర్లను జలధికి తీసుకెళుతున్న దృశ్యం

కూడేరు: మండలంలోని జయపురం గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకల్లో భాగంగా జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామున పీర్లు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. తొలుత పీర్లకు ముజువార్ చక్కెర చదివింపులు చేపట్టారు. సాయంత్రం పీర్లను దప్పుల నడుమ జలధికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు చిందులు తొక్కారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

కణేకల్లు: పట్టణంలోని ఉరవకొండ మెయిన్‌రోడ్డులో చిన్నపీర్ల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నపీర్లను కొత్త వస్త్రాలు, వివిధ ఆభరణాలతో అలంకరించి పీర్ల చావిడి బయట కొలువుదీర్చారు. భక్తులు పీర్లకు చెక్కర ఫాతేహాలు జరిపించారు

నేడు, రేపు చిన్న మొహర్రం



ఊరువాకిలి పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చావిడిల్లో కొలువుదీరిన కొడి పీర్ల పెద్ద సరిగెత్తు వేడుకలు, పీర్ల జలధి, ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. సోమవారం పీర్ల పెద్ద సరిగెత్తు, పానకాల సమర్పణ, 8వ తేదీ కోట ఏరియాలో ఊరేగింపు అనంతరం జలధి కార్యక్రమం ఉంటుందన్నారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా మొహర్రం శాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు.

వేంకటేశ్వరుడి ఆలయానికి నూతన శోభ

- ఫలించిన విప్ కాపు దంపతుల కృషి
- రూ.4 కోట్ల నిధులకు ఎస్టిమేట్ తయారు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు, పట్టణవాసులు



విప్ సతీమణి కాపు భారతికి టీటీడీ జ్ఞాపికను అందిస్తున్న డీఈ శ్రీనివాస్‌ప్రసాద్

రాయదుర్గం: పట్టణంలోని కోటలో ప్రసిద్ధి చెందిన ప్రసన్న వేంకటరమణుడి ఆలయంలో అభివృద్ధి పనులకు ముందడుగు పడింది. విజయనగర రాజుల కాలంలో నిర్మితమైన ఈ అతి పురాతన ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ను పోలిఉంది. గతంలో పాలకులు ఆలయ అభివృద్ధిని గాలికొదిలేశారు. ఫలితంగా గర్భగుడి మినహా మిగిలిన ప్రహరీ, ముఖద్వారం, కోనేరు లాంటివి శిథిల దశకు చేరాయి. క్రమంగా మరింత దెబ్బతినే పరిస్థితి కనిపించింది. భక్తుల మనోభావాల దృష్ట్యా విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి నిధులు రాబట్టే విషయంలో రాజీలేని పోరాటం చేశారు. గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు. ఆలయ అభివృద్ధికి రూ.4 కోట్లు నిధులు సమకూర్చేలా కృషి చేశారు.

ఎస్టిమెంట్లకు కొలతలు

ఆలయంలో పాకారం (ప్రహరీ), పుష్కరణీరు (కోనేరు) నిర్మాణానికి టీటీడీ ద్వారా మంజూరైన రూ.2.65 కోట్లు, దేవదాయశాఖ ద్వారా ఆలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.1.50 కోట్లతో ఆ శాఖ డీఈ శ్రీనివాస్‌ప్రసాద్, జేఈ హరిత ఆదివారం ఎస్టిమెంట్ కొలతలు తీశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడారు. ఈ నిధులకు టెండర్లు పిలిచి సకాలంలో పనులు పూర్తిచేసేలా కృషి చేస్తామన్నారు. విప్ కాపు దంపతుల చొరవతోనే ఈ పురాతన ఆలయానికి నూతన శోభ రానుందన్నారు. అనంతరం విప్ స్వగృహం వద్ద సతీమణి కాపు భారతిని కలసి టీటీడీ జ్ఞాపికను అందజేశారు. పనులు పూర్తయ్యే వరకు పూర్తి సహకారం అందించాలని కాపు భారతి డీఈని కోరారు. అలాగే నియోజకవర్గంలోని పలు మండలాల్లోనూ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, అక్కడ కూడా పనులు వేగవంతం చేయాలన్నారు. ఏళ్లనాటి కల నెరవేర బోతుందని భక్తులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు దేవదాయ శాఖ అధికారులు విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గొని పాలాక్షిరెడ్డి, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, దేవదాయ శాఖ సిబ్బంది జితేంద్ర పాల్గొన్నారు.

పనులు చేయకపోయినా బిల్లుల డ్రా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేయక పోయినా దొంగ బిల్లులు సృష్టించి సర్పంచు ఎస్.తిమ్మరాజు నిధులు డ్రా చేసుకొని కాజేశారని ఎంపీటీసీ సభ్యుడు కాక తిమ్మరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు యాదవ్, కుల్లాయిస్వామి, సంజప్ప ఆరోపించారు. మండలంలోని వి.కొత్తకోటలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మద్దతుదారు, సర్పంచు తిమ్మరాజు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయక పోయినా పంచాయతీ నిధులను డ్రా చేసుకొని కాజేశారన్నారు. నాలుగు నెలల కిందట పంచాయితీకి సంబంధించి ఆర్వో ప్లాంటును అప్పటి ఈఓఆర్డీ చంద్రమౌళి, సర్పంచు సమక్షంలో వేలం వేశారు. స్థానికంగా ఉన్న ఎన్.వీరాంజనేయులు రూ.30 వేలకు ప్లాంటును దక్కించుకున్నాడు. ఆర్వో ప్లాంటును మరమ్మతులు చేయకుండా అప్పచెప్పడంతో పాటు మరమ్మతులు చేయించినట్లు దొంగ బిల్లులు సృష్టించి రు.1.20 లక్షలు తన సొంత ఖాతాలోకి జమ చేసుకున్నాడన్నారు. అలాగే గ్రామంలో వీధి లైట్లు వేశానని, పారిశుధ్య పనులు చేయించానని, ఎస్సీ, బీసీ కాలనీలో బోర్లు వేయించినట్లు చూపించి నిధులు స్వాహా చేశారని వాపోయారు. తాగునీటి పైపులైన్‌లో కూడా సర్పంచు వంకరబుద్ధి చూపించి వేలాది రూపాయలు డ్రా చేశారన్నారు.అంతే కాకుండా గ్రామంలో రైతులంతా కలసి చందాలు వేసుకుని కరకముక్కలకు వెళ్ళే రహదారిలో గ్రావెల్ వేసుకుంటే.. పంచాయతీ నిధులు ఖర్చు చేసి గ్రావెల్ వేయించి మరమ్మతులు చేసినట్లు లక్షల రుపాయలు డ్రా చేసుకున్నారన్నారు. అధికారులు విచారణ చేపట్టి సర్పంచ్ కాజేసిన నిధులను రికవరీ చేయించి, పంచాయతీ అభివృద్ధికి సహకరించేలా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండు చేశారు. కార్యక్రంలో ఖాదర్ బాషా, ఎర్రిస్వామి, ఆనందు, అనిల్, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నేడు భూమి పూజ

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండల కేంద్రంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం భూమిపూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు హాజరుకావాలన్నారు.

సంక్షేమానికే పట్టం కట్టండి



సిరిగేదొడ్డిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: ప్రజా సంక్షేమానికి పార్టీలకతీతంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మరోసారి పట్టం కట్టాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని సిరిగెదొడ్డి గ్రామంలో కె.పి.దొడ్డి సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, గ్రీవెన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొని కాంతారెడ్డి, అధికారులతో కలసి విప్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. సమాజానికి పట్టిన చీడపురుగులైన టీడీపీ దొంగల ముఠాను నమ్మరాదని హితవు పలికారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు కార్యక్రమం పేరుతో టీడీపీ నాయకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి పందికొక్కులా తిన్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చేందుకు టీడీపీ నేత చంద్రబాబు వేసిన స్కెచ్ మరోసారి పుంగనూరులో బట్టబయలైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల అనేక రకాలుగా లబ్ధి పొందాం. ఆయకకు అండగా వుంటాం. ఎవరెన్ని చెప్పినా మేము వినేది లేదు. జగనన్నకు తోడుగా నిలబడతామని పలువురు మహిళలు భరోసా ఇవ్వడంతో విప్ సంతోషం వ్యక్తం చేశారు కార్యక్రమంలో సర్పంచ్‌లు కోట్ల ఉమేష్, రాజేష్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాలయ్య, కిందింటి పాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, అగ్రిఅడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, గోల్డ్ ఘని, కప్పల పాలయ్య, చెరువుదొడ్డి రామాంజనేయులు, సంజీవప్ప, రామాంజి, చెరువుదొడ్డి రామన్న, రంగప్ప, లక్ష్మన్న, జయపాల్, ఉమేష్, తిప్పమ్మ, పాలనాయక తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ రాజా.. ఇదేనా నీ అభివృద్ధి!



టీడీపీ పాలనలో అర్ధంతరంగా ఆగిపోయిన సబ్‌మార్కెట్‌యార్డు

కణేకల్లు: చేయని పనులను తానే చేసినట్టూ... గోరంత పనులు చేసి కొండంత చేసినట్లు సెల్ఫీ వీడియోలతో గొప్పలు చెప్పుకునే మాజీ మంత్రి కాలవ తీరు చూసి జనాలు నవ్వుకుంటున్నారు. సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడంలో కాలవకు సాటెవ్వరూ లేరని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. జనాదరణ లేక రోజురోజుకూ టీడీపీ భూస్థాపితమవుతుండటంతో ఏదో విధంగా ఆ పార్టీకి ఊపిరి పోయాలనే తపనతో కాలవ సెల్ఫీతో సెల్ఫ్ డబ్బా కొట్టుకోవాలని చూస్తున్నారని... ఆయన చేసిందేమీ లేదు. అభివృద్ధి చేసినట్టు చెప్పుకునే కాలవా.... కణేకల్లు సబ్ మార్కెట్‌యార్డు ఎందుకు పట్టించుకోలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకంటే ఆ పార్టీ నాయకుల ప్రయోజనాలు, కార్యకర్తల స్వాలాభమే అత్యంత ముఖ్యం. అందుకేనేమో కణేకల్లు శివారులో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు శ్రీకారం చుట్టారు. సబ్ మార్కెట్‌యార్డు నిర్మాణానికి అప్పట్లో రూ.90 లక్షలు మంజూరయ్యాయి. ప్రహరీ నిర్మాణానికి రూ.14లక్షలు మంజూరయ్యాయి. ఏ మాత్రం ముందు చూపు లేకుండా అనువుగాని చూట అంటే ఊరి బయట సబ్ మార్కెట్‌యార్డు పనులు చేపట్టారు. పనులైనా పూర్తి చేశారా! అంటే అదీ లేదు. అరకొరగా చేపట్టారు. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేసి చేతులు దులుపేసుకున్నారు. గోదాములన్నీ నెర్రలు బారాయి. ప్రహరీ పలుచోట్ల కూలిపోయింది. సబ్‌మార్కెట్‌యార్డుతో తమకెంతో ప్రయోజనం కలుగుతోందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. మార్కెట్‌లో రైతులు పండించిన ఉత్పత్తులకు సరైన ధర లేక పోతే మార్కెట్‌యార్డు గోదాముల్లో నిల్వ చేసుకునేలా సౌకర్యం కల్పించడమే సబ్‌మార్కెట్‌యార్డు లక్ష్యం. హెచ్చెల్సీ ఆయకట్టు ప్రాంతమైన కణేకల్లులో సబ్‌మార్కెట్‌యార్డు అత్యంత అవసరం. సబ్ మార్కెట్‌యార్డు అనేది రైతుల చిరకాల కోరిక కూడా. గత ప్రభుత్వ హయాంలో సబ్‌మార్కెట్ యార్డు పనులు చేపట్టడంతో ఎంతో సంబరపడిపోయిన రైతులు ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం చూసి మండిపడ్డారు. సబ్‌మార్కెట్ యార్డును ఎందుకు పూర్తి చేయలేదని రైతులు, ప్రజలు ప్రశ్నిస్తే చెప్పుకొనేందుకు కాలవ వద్ద సమాధానం కూడా లేదు.

దారే అసలు సమస్య!

ఏమాత్రం ఆలోచన లేకుండా టీడీపీ నాయకులు ఊరి బయట సబ్‌మార్కెట్‌యార్డు నిర్మాణం చేపట్టారు. అక్కడికెళ్లడానికి దారి కూడా లేదు. అక్కడికెళ్లాలంటూ రైతులకు చెందిన పట్టాభూములు దాటి వెళ్లాలి. తూర్పు, పడమర... రెండు వైపులా పట్టా భూములున్నాయి. వారు దారీ ఇవ్వరు. అంతేకాక అక్కడకు వెళ్లడానికి వీలు లేకుండా తూర్పు వైపున్న ఓ వ్యక్తి గుంతలు కూడా తీశాడు. దీంతో రైతులకు ఉపయోగపడే ఈ సబ్‌మార్కెట్ యార్డును ఎలాగైనా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజనాయక్‌ను పలుదఫాలు ఇక్కడికి పంపించి దారి సమస్య తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మార్కెట్ యార్డు చైర్మన్ ఓ రైతుతో చర్చించి దారి సమస్య ఓ కొలిక్కి తెచ్చారు. ఈ విషయమై మార్కెట్ యార్డు చైర్మన్ మాట్లాడుతూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం బాగా అలవాటైందని మండిపడ్డారు. ఆయన పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. అర్ధంతరంగా ఆపేసిన సబ్ మార్కెట్‌యార్డు పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటామని, అలాగే దారి కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

అల్లా మార్గంలోనే మోక్షం



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న మౌలానా రషీద్‌సాబ్

రాయదుర్గంటౌన్: మంచితనంతో అల్లా కృప పొంది ప్రతి ఒక్కరూ ఇహ, పర లోకాల్లో ఉన్నత స్థానంలో ఉంటారని, మహమ్మద్ ప్రవక్త నియమాలను పాటిస్తేనే ముస్లిం జీవితానికి సార్థకత లభిస్తుందని మౌలానా అబ్దుల్ రషీద్‌సాబ్(పూణె, మహారాష్ట్ర) పిలుపునిచ్చారు. పట్టణంలోని మక్కామసీదులో ఆదివారం తబ్లిగ్ జమాత్ ఆధ్వర్యంలో జరిగిన ఒక రోజు ఆధ్యాత్మిక సమ్మేళనం(మసీదుస్థాయి జోడ్)కు భారీఎత్తున ముస్లింలు తరలివచ్చారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, మొలకాల్మూరు, వైఎస్ హొసకోట, కంబదూరు, కణేకల్లు ప్రాంతాల నుంచి ముస్లింలు హాజరై సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి ఇషా నమాజ్ వరకూ సదస్సు జరిగింది. మౌలానా రషీద్‌సాబ్ మాట్లాడుతూ స్వార్థం, నిరాశ, నిస్పృహ, ఇతరుల పట్ల ద్వేషం వీడాలని, సర్వజీవులపై ప్రేమానురాగాలు కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇస్లాం పునాది అయిన నమాజ్‌ను ప్రతి ఒక్కరూ ఐదుపూటల ఆచరించాలన్నారు. ప్రత్యేక దువాతో సదస్సును ముగించారు. కార్యక్రమంలో రాయదుర్గం జమాత్ పెద్దలు, మౌలానాలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–2006లో 10వ తరగతి చదివిన విద్యార్థులు స్నేహితుల దినోత్సవం రోజు ఆదివారం కలుసుకున్నారు. అదే పాఠశాల వేదికగా కలసి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, నగేష్, గోపాల్, స్వర్ణలత, రాజన్న, సూర్య నారాయణ, రామానాయక్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మండల సమావేశం

కణేకల్లు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలి



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంబదూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు ఆగిపోవాలని, ఆ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆదివారం కంబదూరు సీఆండ్‌బీజీ మిషన్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు ప్రభాకర్, జోసఫ్ రెడ్డి, జోయెల్, విల్సన్, జయరాజు, కుమార్, బాబు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

రాయదుర్గంటౌన్: మణిపూర్‌లో మారణహోమాన్ని ఖండిస్తూ నియోజకవర్గంలోని ఐదు మండలాల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్(జేసీఎం) ఐదు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సల్మాన్ హంపన్న ఆదివారం తెలిపారు. పట్టణంలోని బీటీపీ రోడ్డు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. క్రైస్తవులు తరలివచ్చి ర్యాలీ జయప్రదం చేయాలన్నారు.

దశభుజ గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బొమ్మనహాళ్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శివ సూచించారు. ఆదివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులోని వేదావతి హగరి నది వద్ద ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్వి చక్ర వాహనదారులు తప్పనసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదకరమైన మలుపులు ఉన్న చోట సూచనలు పాటించాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అనాథలకు అన్నదానం

కూడేరు: మండలంలోని శివరాంపేటకు చెందిన వలంటీర్ బోయ శ్రీకాంత్ జయంతిని పురస్కరించుకుని ఆయన తండ్రి వెంకటేశులు ఆదివారం మండలంలోని గొటుకూరులోని బెరాక్ అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశాడు. కుమారుడి జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నాడు.

గుండె వైద్య శిబిరానికి స్పందన

వజ్రకరూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారం, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.ఉస్మాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. గుండె సంబంధిత వ్యాధి లక్షణాలున్న పది మందిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వాహనంలో అనంతపురానికి తరలించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో తదితర పరీక్షలతో పాటుగా దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ రఘుపతి, నాయకులు బెస్త ఆది, తిప్పారెడ్డి, ప్రభుదాసు, వైద్యుడు నాగరాజు, మార్కెటింగ్ మేనేజర్ రమేష్, టెక్నీషియన్లు భావన, సంధ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ అప్పన్న గారి వీరారెడ్డి (90) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ ప్రభావతి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీర శైవలింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, కంబదూరు ఓబయ్య కుమారుడు సుధీర్, విశ్రాంత ఎంఈఓ వీరన్న, డాక్టర్ రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాభివృద్ధి కోసం వీరారెడ్డి కృషి మరువలేనిదని వారు గుర్తుచేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బ్రహ్మసముద్రం: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పోలేపల్లికి చెందిన కురుబ మాంతేష్ (36) శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆయన మూడు ఎకరాల్లో టమాట, పత్తి పంటలు సాగు చేశాడు. మూడేళ్లుగా పంటలు సరిగ్గా పండకపోవడంతో పెట్టుబడులకు చేసిన అప్పులు పెరిగిపోయాయని భార్యతో మధనపడేవాడు. అప్పులు తీరేమార్గం కానరాక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

ఆస్తి విషయంలో గొడవ

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం డి.చెన్నంపల్లిలో ఆస్తి విషయమై బంధువుల మధ్య గొడవ జరిగింది. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశులు, అదే గ్రామానికి చెందిన బొమ్మక్క కుటుంబాల మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదం నడుస్తోంది. అయితే శనివారం రాత్రి వాదోపవాదాలు చేసుకోగా గొడవకు దారి తీసింది. ఘటనలో వడ్డే వెంకటేశులు తలకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం బొమ్మక్క సైతం ఆస్పత్రిలో చేరింది. అయితే ఘటనపై కంబదూరు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వివాహిత మృతి

కంబదూరు: మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వివాహిత ధనలక్ష్మి(32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గత కొద్దికాలంగా ఆమె కడుపునొప్పితో బాధపడుతుండేది. శనివారం కడుపు నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త తిప్పేస్వామి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.